## క్లుప్తంగా

### గుర్రం జాషువా రచనలు స్ఫూర్తిదాయకం



గన్నవరం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో ఆదివారం నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ అధ్యక్షుడు జీవీ.రవిబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో కులమతాల మధ్య అంతరాన్ని చెరిపేసి సమానతను, మానవతను ప్రవచించిన ఆయన జనం మెచ్చిన కవిగా అభివర్ణించారు. సామాజిక ప్రయోజనాలను ఆశించి ఆయన రచనలు చేశారని తెలిపారు. జాషువా రచించిన గబ్బిలం రచన ఎంతో స్ఫూర్తిదాయకమైనదన్నారు. గ్రంథాలయాధికారి కే.నాగరాజు, సిబ్బంది పి.దుర్గాలక్ష్మి, పాఠకులు పాల్గొన్నారు.

### ఘనంగా వరల్డ్ హార్ట్ డే



పెనమలూరు: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎమ్మెల్యే బోడెప్రసాద్ అన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పోరంకి కామినేని ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం గుండె ఆరోగ్య సంరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ ఆధునిక జీవన విధానం కారణంగా చిన్న వయస్సులోనే అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాయామం చేయాలన్నారు. కామినేని మెడికల్ డైరెక్టర్ ఎస్ఆర్ఎస్.వర్ధన్, డాక్టర్ కల్యాణ్ వెంకటేశ్వర్లు, డాక్టర్ ఆర్.అర్చన, డాక్టర్ భరత్, డాక్టర్ సురేష్, పలువురు పాల్గొన్నారు.

### ముగిసిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం



నున్న(విజయవాడరూరల్): ప్రపంచ ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థ వాధ్వానీ ఫౌండేషన్- కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా నున్న వికాస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో జరుగుతున్న శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్పోక్ అండ్ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ కిషోర్‌రెడ్డి మాట్లాడుతూ 36 మంది అధ్యాపకులకు ఆధునిక ఉపాధి నైపుణ్యాలు, బోధన మూల్యాంకనంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అవసరమైన టెక్నాలజీ ఆధారిత సాధనాలు వంటి అంశాలపై శిక్షణ ఇచ్చామన్నారు. వాధ్వానీ ఫౌండేషన్ న్యూఢిల్లీకి చెందిన సీనియర్ ట్రైనర్ యోగేష్ జోషిరు, దక్షిణ భారతదేశానికి చెందిన వాధ్వానీ ఫౌండేషన్ కార్యనిర్వాహకులు తౌషిఫ్ అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ట్రైనర్స్‌కు కళాశాల సెక్రటరీ ఎస్.సత్యనారాయణరెడ్డి జ్ఞాపికలను అందజేశారు.

# ఏటిపాయకు ఉధృతంగా వరద

- నీట మునిగిన పంట పొలాలు
- ఆందోళనలో రైతులు

కంకిపాడు: కృష్ణమ్మ మహోగ్ర రూపం దాల్చింది. ఏటిపాయలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో ఏటిపాయ నిండుకుండలా మారింది. కడలి వైపు వరదనీరు ఉరకలు వేస్తోంది. ఏటిపాయ ఉధృతికి పాయ వెంబడి ఉన్న పంట పొలాలు ముంపునకు గురవ్వటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. దీంతో ఇరిగేషన్ అధికారులు 6.15 లక్షల క్యూసెక్కుల వరదనీటిని ఏటిపాయ, ప్రధాన కాలువలకు విడుదల చేశారు. దీంతో కృష్ణానది ఏటిపాయ ఉధృతంగా పొంగి పొర్లుతోంది. మండలంలోని మద్దూరు, కాసరనేనివారిపాలెం వద్ద ఏటిపాయ అంచులు దాటి కరకట్ట వైపు వరదనీరు చొచ్చుకువస్తోంది. ఏటిపాయ ఉధృతికి మత్స్యకారులు తమ పడవలను కరకట్ట వైపునకు తరలించి సురక్షిత ప్రాంతాల్లో భద్రపరిచారు.

**నీటి ముంపులో పంట పొలాలు..**

ఏటిపాయ వెంబడి ఉన్న పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. కరకట్ట దిగువున అరటి, బెండ, తమలపాకు, కంద, ఇతర కూరగాయ పంటలను రైతులు సాగు చేస్తున్నారు. ఏటిపాయకు భారీగా చేరిన వరదనీరు కరకట్ట వైపు ప్రవహించటంతో పాయ వెంబడి సాగులో ఉన్న తోటల్లోకి వరదనీరు



పెదపులిపాక వద్ద కట్టకు తన్నిపెట్టిన వరద నీరు

చేరి పంట పొలాలు ముంపు బారినపడ్డాయి. లక్షలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట పొలాలు ముంపునకు గురవ్వటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతేడాది సెప్టెంబరులో సంభవించిన వరదతో రైతులు తీవ్రంగా నష్టాన్ని చవిచూశారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో వరదతో మళ్లీ కష్టం వచ్చిపడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**కృష్ణానదికి మళ్లీ వరద భయం**

పెనమలూరు: కృష్ణానదికి మరలా వరద రావటంతో తీర గ్రామాలు వణికిపోతున్నాయి. ఈ ఏడాదిలో ఇప్పటికి నాలుగు సార్లు నదికి భారీ వరద వచ్చింది. అయితే ఇప్పుడు 6 లక్షల క్యూసెక్కుల వరద నీరు రావటంతో ప్రజలు భయాందోళనలో ఉన్నారు. మండల పరిధిలో కృష్ణానది యనమలకుదురు, పెదపులిపాక, చోడవరం గ్రామాల నుంచి ప్రవహిస్తుంది. ప్రస్తుతం వరద కారణంగా మూడు గ్రామాల ఘాట్‌ల వద్దకు వరద నీరు చేరుకుంది. ప్రధానంగా యనమలకుదురు, పెదపులిపాక గ్రామాలలో కరకట్ట దిగువున నదీ పరీవాహక ప్రాంతంలో అక్రమంగా ఇళ్ల నిర్మాణం చేసుకొని నివశిస్తున్నవారు భయపడు తున్నారు. గత ఏడాది వరద కారణంగా ఇళ్లల్లోకి నీరు చేరి చాలా మంది నష్టపోయారు. ఇప్పుడు కూడా వరద పెరిగితే తమ పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. కృష్ణానదికి ఇంకా వరద పెరిగితే కరకట్ట దిగువన ఉన్న నివాసితులకు ఇబ్బందులు ఎదురవుతాయి. ప్రస్తుతం పెదపులిపాక వద్ద వరద నీరు వాటర్ ప్లాంట్ అంచుకు చేరుకుంది.



కాసరనేనివారిపాలెం వద్ద నీట మునిగిన బెండ తోట



మద్దూరు సమీపంలో నీట మునిగిన అరటి తోట



మద్దూరు వద్ద కరకట్ట అంచులు తాకుతూ ప్రవహిస్తున్న వరదనీరు

# మహాచండీ.. పాహిమాం!



కంకిపాడు శివాలయంలో మహా చండీ దేవిగా..



ప్రొద్దుటూరు శివాలయంలో మహా చండీదేవిగా కాశీ అన్నపూర్ణాదేవి



ఉప్పలూరులో పూజలందుకుంటున్న మహాచండీదేవి



దావాజిగూడెం రామాలయంలో కుంకుమార్చనలు



యనమలకుదురులో కాళరాత్రిదేవిగా



యనమలకుదురు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో..

**కొనసాగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు**

కంకిపాడు: గన్నవరం, పెనమలూరు నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అమ్మవారు ఏడో రోజైన ఆదివారం మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాచండీ...పాహిమాం.. అంటూ భక్తజనం అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపించారు. కంకిపాడు, ప్రొద్దుటూరు, ఈడుపుగల్లు, మద్దూరు, మంతెన, ఉప్పలూరు గ్రామాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం మూలానక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ఆయా ఆలయాల ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేశారు.

గన్నవరం: దేవీశరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారు శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. దావాజిగూడెంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారికి పది వేల గాజులతో విశేష అలంకరణ జరిపారు. సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. స్థానిక శ్రీగాయత్రి అమ్మవారి మందిరంలో చండీ హోమం జరిపారు. పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో పలువురు దంపతులు మహాచండీదేవికి పూజలు చేశారు. అనంతరం సామూహిక శ్రీలలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చనలు జరిపారు. స్థానిక యాదవులపేట రామాలయం, శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

పెనమలూరు: మండల పరిధిలోని యనమలకుదురులో ఆదివారం పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో పార్వతీ దేవిని కాళరాత్రిదేవిగా అలంకరించారు. లాకుల సెంటర్‌లో కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని మహాచండీదేవి అలంకరణ చేశారు. పోరంకి గంగానమ్మగుడి వద్ద అమ్మవారికి చండీహోమం చేశారు. పెదపులిపాక విజయ రాజరాజేశ్వరి ఆలయం, చోడవరం నాగేంద్రస్వామివారి ఆలయం, పోరంకి షిరిడి సాయిబాబా మందిరంలో పూజలు చేశారు.

ఉయ్యూరు: ఉయ్యూరులోని విజయ దుర్గా భవానీ దేవి ఆలయంలో చాముండేశ్వరీ దేవిగా, శివాలయంలో గాయత్రీదేవిగా, పెద ఓగిరాలలో లలితా పరమేశ్వరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉయ్యూరు శివాలయంలో శ్రీజగదాంబ సమేత సోమేశ్వరస్వామిని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. రాయల్ వంశీస్‌లో చండీ యాగం నిర్వహించారు.

**అమ్మవారి ప్రభ ఊరేగింపు**

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో ఆదివారం శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ప్రభ ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఏలూరు కాలువ సమీప శ్రీకనకదుర్గమ్మ ఆలయంలో పూజలు జరిపారు. ఎంపీటీసీ సభ్యుడు శౌంతి కిషోర్ నేతృత్వంలో ఎడ్లబండిపై ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారి ప్రభ ఊరేగింపును




కేసరపల్లిలో శ్రీకనకదుర్గమ్మ ప్రభ ఊరేగింపు

ప్రారంభించారు. గ్రామోత్సవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రభకు భక్తులు హారతులు పట్టారు. మాజీ ఎంపీపీ పొట్లూరి బసవరావు, గ్రామ సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక, ఉప సర్పంచి జాస్తి శ్రీధర్‌బాబు, రాజులపాటి శ్రీనివాసరావు, రత్తయ్య, చంద్రశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): స్థానిక కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. దేవదాయశాఖకు చెందిన శ్రీఅన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవి మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. శ్రీషిర్డి సాయిబాబా మందిరంలో మహాచండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా భక్తులు పూజలు చేశారు. చినకంచిలో శ్రీకామాక్షి అమ్మవారు మహాచండీదేవిగా దర్శనిమిచ్చారు. కుంకుమ పూజలు నిర్వహించారు. పి.నైనవరం శివనాగేంద్రస్వామి దేవస్థానంలో అమ్మవారు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు. అంబాపురంలోని కనకదుర్గ దేవస్థానంలో అమ్మవారు మహాచండీదేవి అలంకరణలో భక్తులు దర్శించుకున్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో మహా చండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులకు ఆకట్టుకుంది.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం, ఐటీఐ రోడ్డులోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానం, ఏలూరురోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాలు, మహత్మగాంధీనగర్, ఎన్టీఆర్ కాలనీల్లో ప్రత్యేక ఉత్సవ మండపాల్లో మహాచండీదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. బాపులపాడులోని శ్రీభ్రమరాంబ సమేత శ్రీశైల మల్లికార్జున స్వామి దేవస్థానంలో మహాచండీ హోమం నిర్వహించారు. విజయవాడ అభినమ నాట్య మండలి ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది.



చాముండేశ్వరీ దేవిగా ఉయ్యూరు విజయ దుర్గాభవానీ



హనుమాన్‌జంక్షన్‌లో మల్లికార్జునస్వామి దేవస్థానంలో మహాచండీదేవిగా



నున్న శ్రీకనకదుర్గ దేవస్థానంలో మహాచండీదేవిగా



రామవరప్పాడు మహాచండీ దేవిగా పేరంటాలమ్మ

## అనధికార లేఅవుట్‌లు క్రమబద్ధీకరించుకోవాలి

### మున్సిపల్ కమిషనర్ నజీర్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అనధికార లేఅవుట్‌లను క్రమబద్ధీకరించుకోవటానికి ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ 2020 ప్రకటించిందని మున్సిపల్ కమిషనర్ షేక్ నజీర్ తెలిపారు. ఆయన ఆదివారం వివరాలు తెలుపుతూ ఈ ఏడాది జూన్ 30 నాటికి రిజిస్టర్ అయిన అనధికార లేఅవుట్లు, ఇళ్ల ప్లాట్‌లను క్రమబద్ధీకరించుకోవటానికి కటాఫ్ డేట్ ఇచ్చారన్నారు. దరఖాస్తు చేసుకోవటానికి అక్టోబర్ 20వ తేదీ వరకు గడువు ఇచ్చారన్నారు. ఈ పథకం కింద ప్రోత్సాహకాల వివరాలు తెలుపుతూ 7 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు, 45 రోజులలో పీనలైజేషన్ చార్జీలు చెల్లిస్తే రాయితీ 10 శాతం, 90 రోజుల్లో పూర్తి రుసుము చెల్లిస్తే 5 శాతం రాయితీ ఇస్తామన్నారు. అనధికార లేఅవుట్‌లకు విధిగా 30 అడుగుల రోడ్డు ఉండాలన్నారు. యజమానులు క్రమబద్ధీకరించుకోని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**జీఎస్‌టీపై అవగాహన**

కేంద్ర ప్రభుత్వం జీఎస్‌టీ 2.0 ప్రకటించిన నేపథ్యంలో జీఎస్‌టీపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని కమిషనర్ నజీర్ తెలిపారు. ప్రభుత్వం తగ్గించిన జీఎస్‌టీపై సచివాలయం సిబ్బంది ఇళ్లకు వచ్చి అగాహన కల్పిస్తారన్నారు. జీఎస్‌టీ సంస్కరణలతో మహిళా సాధికారత సాధనకు ఉపయోగపడుతుందని కమిషనర్ తెలిపారు.

## నేడు ధాన్యం కొనుగోళ్లపై సమావేశం

కంకిపాడు: ఈ ఖరీఫ్ సీజన్‌కు చేపట్టనున్న ధాన్యం కొనుగోళ్లపై ఈనెల 29వ తేదీన ఉదయం 11 గంటలకు కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ వీ.భావ నారాయణ తెలిపారు. సమావేశానికి ఉయ్యూరు ఆర్‌డీఓ హేలా షారోన్ హాజరవుతారని, రైతులు, రైతు సంఘాల ప్రతినిధుల నుంచి ధాన్యం కొనుగోళ్లపై సలహాలు, సూచనలు స్వీకరిస్తారన్నారు. సమావేశానికి సివిల్ సప్లయీస్, రెవెన్యూ, వ్యవసాయశాఖ, మార్కెటింగ్, పీఏసీఎస్‌ల ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

## భవానీ భక్తులకు అన్నదానం అభినందనీయం

హనుమాన్‌జంక్షన్ రూరల్: మానవ సేవే మాధవ సేవగా భావించి గత 17 సంవత్సరాలుగా భవానీ భక్తులకు అన్నదాన శిబిరం నిర్వహిస్తున్న పుట్టగుంట సతీష్‌కుమార్ అభినందనీయుడని మాజీ ఎంపీ మాగంటి వెంకటేశ్వరరావు (బాబు) అన్నారు. దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని విజయవాడ దుర్గ గుడికి కాలి నడకన తరలి వెళ్లుతున్న భక్తులకు బాపులపాడు మండలం బొమ్ములూరులో పారిశ్రామిక వేత్త, విశ్వహిందూ పరిషత్ జాతీయ ట్రస్టీ పుట్టగుంట సతీష్‌కుమార్ ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని మాగంటి బాబు దంపతులు ఆదివారం సందర్శించారు. ఈ శిబిరంలో ఉదయం, సాయంత్రం అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాట్లతో పాటుగా వృద్ధులు, మహిళల కోసం ప్రత్యేకంగా విశ్రాంతి, వైద్య సదుపాయాలను కల్పిస్తున్నట్లు దాత పుట్టగుంట వివరించారు. ముందుగా ఉత్సవ మండపంలోని అమ్మవారికి మాగంటి బాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## రేపటిలోగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలి



గన్నవరం: ఉంగుటూరు మండలంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు ప్రక్రియను ఆదివారం మండల వ్యవసాయ అధికారి జీ. రమేష్ పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులతో మాట్లాడిన ఆయన ఈ క్రాప్ నమోదును వేగవంతం చేయాలని సూచించారు. మండలంలో 27 వేల ఎకరాలు సాగులో ఉండగా ఇప్పటి వరకు 23,500 ఎకరాలకు పంట నమోదు చేసినట్లు తెలిపారు. మిగిలిన 3,500 ఎకరాలకు సంబంధించిన రైతులు కూడా ఈ నెల 30వ తేదీలోపు వీఏఏలను సంప్రదించి పంట నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ క్రాప్ నమోదు చేయించుకున్న రైతులు మాత్రమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను మద్దతు ధరకు విక్రయించుకోవచ్చన్నారు. ప్రకృతి వైపరీత్యాలప్పుడు ప్రభుత్వ నష్టపరిహారం పొందడానికి అర్హులుగా పేర్కొన్నారు. రైతులందరూ ఈ క్రాప్‌ను తప్పనిసారిగా నమోదు చేయించుకోవాలని కోరారు.

# జాతీయ రహదారిపై ట్రాఫికర్

- రోజూ ఎదురవుతున్న సమస్య
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- సర్వీసు రోడ్లు లేకపోవటమే కారణం
- సమస్యపై దృష్టిపెట్టని కూటమి ప్రభుత్వం

పెనమలూరు: మండల పరధిలో జాతీయ రహదారిపై తరచుగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. దీంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ తీసుకోక పోవటం ప్రజలకు శాపంగా మారుతోంది.

**విషయం ఇదీ..**

మండల పరిధిలో విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి (బందరు రోడ్డు) దాదాపు 20 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. గత 14 సంవత్సరాల క్రితం జాతీయ రహదారిని విస్తరించారు. పెద్ద ఎత్తున నిధులు వెచ్చించి భూసేకరణ చేశారు. అయితే సర్వీస్ రోడ్లు మాత్రం వేయకుండా వదిలేశారు. సర్వీస్ రోడ్లు వేయలేనప్పుడు భూసేకరణ ఎందుకు చేశారన్నది నేటికీ పెద్ద ప్రశ్నగా మారింది.

**సమస్యకు కారణం ఇదీ..**

జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోంది. ఇటీవల కాలంలో వాహనాల సంఖ్య చాలా పెరిగింది. దానికి తగ్గట్టుగా నేషనల్ హైవే అధికారులు బందరు రోడ్డు విస్తరణపై దృష్టి పెట్టకపోవటంతో నానాటికీ ట్రాఫిక్ సమస్య జటిలంగా మారుతోంది. కామయ్యతోపు, తాడిగడప జంక్షన్, పోరంకి, పెనమలూరు సెంటర్‌లలో అండర్ పాస్‌లు లేక పోవటం, సర్వీస్ రోడ్లు కూడా ఏర్పాటు చేయక పోవటంతో ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. భవిష్యత్తులో మరింత ట్రాఫిక్ పెరిగే అవకాశం ఉన్నందును అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పోరంకి వద్ద విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

**రోజూ నరకమే..**

బందరు రోడ్డుపై తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుండటంతో ప్రజలు రోజూ నరకాన్ని అనుభవిస్తున్నారు. అభివృద్ధి జపం చేసే కూటమి సర్కార్ బందరు రోడ్డుపై రోజూ ట్రాఫిక్ నియంత్రణకు కనీస చర్యలు తీసుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

**ట్రాఫిక్‌లో చిక్కుకున్న మంత్రి కారు..**

మండల పరిధిలో ఆదివారం కామయ్యతోపు నుంచి పెనమలూరు వరకు అడుగుడుగునా ట్రాఫిక్ జామ్ అయి వందలాది వాహనాలు నిలిచిపోయాయి. పోరంకి వద్ద ఒక మంత్రి కారు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకు పోయింది. సమస్యకు శాశ్వత పరిష్కారం కావాలంటే బందరు రోడ్డుపై ప్రధాన కూడళ్ల వద్ద అండర్ పాస్‌లు తక్షణం నిర్మాణం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భగత్‌సింగ్ స్ఫూర్తితో ప్రజావ్యతిరేక పాలనపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి ఈశ్వరయ్య అన్నారు. విజయటాకీస్ సెంటర్ తమ్మారెడ్డి భవన్ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్యోద్యమ యువతార భగత్ సింగ్ జయంతి కార్యక్రమం జరిగింది. ఏఐవైఎఫ్ నాయకులు భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో యువతను భాగస్వాములను చేయడంలో భగత్ సింగ్ ఎంతో కీలకంగా వ్యవహరించారన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎం.యుగంధర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందన్నారు. మత్తు పదార్థాల వినియోగం పెరిగిందన్నారు. వీటన్నింటికి ప్రభుత్వాల అసమర్థతే కారణమన్నారు. పేదలకు పండ్లు పంపిణీ చేశారు. నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్, లంకా గోవిందరాజులు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సందడిగా దాండియా



లబ్బీపేట(విజయవాడతూర్పు):దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వి వైబ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటైన దాండియా, గార్భా నృత్యాలు కోలాహలంగా సాగాయి. ఉత్తరాది రాష్ట్రాల తరహాలోనే ఇక్కడ కూడా దాండియా నృత్యం ప్రాచుర్యం పొందడంతో ఆడమగ, చిన్న, పెద్ద వయోబేధాన్ని విస్మరించి ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వాహకుల అంచనాలకు మించి ఈ నృత్యానికి విజయవాడ వాసుల నుంచి విశేష స్పందన లభించింది. ఫుల్ జోష్ గా సాగిన దాండియా నృత్యాలు హుషారుగా కొనసాగాయి. నగరంలోని ఓ హాల్‌లో నిర్వహించిన దాండియా నైట్‌లో నగర ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వందలాది మంది జంటలు ఈ దాండియా, గార్బా నృత్యంలో పాల్గొని డీజే, డోల్ కు అనుగుణంగా నృత్యాలు చేశారు. ఈ నృత్యంలో అన్నిరకాల ఒత్తిళ్లను తగ్గించి మానసిక ప్రశాంతతను కూడా అందిస్తుందని నిర్వాహకులు రాగ వీణ తెలిపారు.